# ఓ రాత్రి

ఈ లోకం నన్నర్థం చేసుకునేంతగా ఎదగలేదు. కానీ ఇది మారవలసి వుంది.

అలా ఓ నిశ్చయానికి వచ్చాక చంద్రానికి నిద్ర పట్టింది. అతని నుదురు విశాలం. దాని మీద ఒంకులొంకులుగా పడుతుంది జుత్తు. కిటికీ ఊసలలోంచి చూస్తూ చంద్రుడు వెన్నెలను కురిపిస్తున్నాడు.

సముద్రాల మీదా, అడవుల మీదా పడి విసుగెత్తి వున్న వెన్నెలలు ఆ మధ్య తరగతి బస్తీలోని ఆ మధ్య తరగతి ఇంటి మీదా పడుతున్నాయి. తూర్పున వున్న ఆ గదిలో చంద్రానికి నిద్ర పట్టినా పడమటి వేపు మరో గదిలోని రమణకు నిద్ర పట్టలేదు.

అన్నగారు తిడితే ఎలా వుండేదో!. కొట్టాడు. కొదమ సింగంలాంటి అన్నగారు - లోకాన్నంతటినీ నమిలి మింగేసి చెల్లెల్ని కాపాడగల భీముడు - ఇంట్లో కుక్కపిల్లను చావ గొట్టి చెవులు మూసినట్టు రమణను కొట్టాడు.

ఆ తన్నుల వెనుక చెమట నిండిన. దేహాలు. సుఖాతిశయంతో పాడారి పోతున్న పెదాలు. శరీరాలను కాగితాలుగా చేసుకుని కవిత్వాలల్లుతున్న గోళ్ళు....

పోనీ! పోనీ! పోతే పోనీ! మర్యాదా పోనీ! మంచి పేరూ పోనీ!

జీవితం సమూల నాశనమై పోనీ!....

రమణ ఆలోచనల నుంచి పక్కకు తిరిగింది.

వెన్నెట్లో పెరడంతా విలాసంగా నవ్వుతోంది. ఆ పెరట్లో తన చెమట తాగి బలిసిన కూరగాయల, పూల మొక్కలు... తన జబ్బల సత్తువ పీల్చే దిగుడుబావి. తన చేతులకూ, ఇంట్లో బట్టలకూ నున్న బడిన నూతి చపటా.

అవన్నీ దాటి అవతలి వాటా వయిపు వెళ్ళలేదు. వెళ్ళే అవకాశం లేదు. అవకాశం వచ్చినప్పుడు అందులో చంద్రం వుండడు. అయిపోయిందంతా అయిపోయింది.

దిగ్గున లేచి కూర్చుంది రమణ.

"ఎందుకు లేచావ్?" అది కొదమ సింగం గొంతు. అయినా అది నిస్సహాయమయిన గొంతు.

చెల్లెలా! చెల్లెలా! మనం బ్రతికేది అరణ్యమయితే, సంచరించేది జంతువులతో అయితే, వాటిని చంపేసి నిన్ను రక్షించుకుంటాను. ఆకలేస్తోందిరా అన్నా అంటే - చెట్టుకొసనున్న పుట్ట తేనె తెస్తాను. నీవడిగిన జంతువును వేటాడి నీ ఆకలి తీరుస్తాను. నీవు కలకాలమూ అమాయకంగా నవ్వులు చిందేందుకు ఏదయినా చేసి వుందునమ్మా. నేనున్నది ఆధునిక సమాజారణ్యంలో. ఇక్కడ అన్నీ గొలుసులే! అన్నీ గుర్తించలేని జంతువులే!

"బయటకు వెళ్ళాలి" అని జవాబిచ్చింది రమణ.

"నిజమేనా,,,,,?"

సమాధానంగా లేచి నించుంది రమణ. నడుం కలుక్కుమంది. నిద్రకి ఉపక్రమిస్తున్న దెబ్బలన్నీ ఆవులించాయి. అసలు అన్నగారు ఆ క్షణంలో చంపేసే వుండాల్సింది.

ఆ క్షణంలో..... చంద్రంతో.... కవిత్వాలల్లుతున్న గోళ్ళు.... ముప్పయ్యేళ్ళ రమణ.....

పెరట్లోకి వచ్చి వెన్నెట్లో నిలబడింది. వెనకాలే వచ్చిన అన్నగారు పెరటి అరుగు మీద కూర్చున్నాడు. బాత్‌రూం తలుపు వేస్తూ చూసింది.

చచ్చిపోతుందని అన్నకి భయం. నవ్వొచ్చింది రమణకి.

పదేళ్ళ క్రితం భర్త తన బ్రతుకు లోంచి నిష్క్రమించిన రాత్రి.....ఈ అన్న ఇలాగే తనను వెన్నంటి వచ్చి తను లోపలకు దూరి తలుపు మూసుకుంటే బయట కూర్చున్నాడు. ఏమిటా సంబంధం? తాము ఇద్దరూ ఓ శరీరంలో కొన్నాళ్ళు విడిగా ఊపిరి పీల్చారు! ఓ ఇంట్లో పెరిగారు. అంతే, పిచ్చి సంబంధం!

ఎవరో తెలీని మగాడు. ఓ బ్రాహ్మడు పెట్టిన ముహూర్తంలో అతను పలుకుతున్న సంస్కృత పదాలని వింటూ, అంటూ, ఓ కాస్త జీలకర్రతో, బెల్లంతో సరాసరి తన నెత్తి మీదకు ఎక్కాడు. తాను గిజాయించుకుంటూ భయంతో, ఇష్టంతో అతనిలో కరిగి పోయింది. తెల్లవారేసరికి తన బ్రతుకే కరిగి పోయింది. పోలీసులు వచ్చారు. అతను అంతకు ముందు చేసుకున్న పద్దెనిమిది పెళ్ళిళ్ళ గురించీ చెప్పారు. శుభముహూర్తాలూ, బలంగల సంస్కృత పదాలూ, అన్నగారి ఆనందాలూ, కందులు పిండి తీర్చుకోమంటున్న ఆరు వేల అప్పూ, పోలీసుల బూట్ల చప్పుడులో కలగల్సిపోయాయి. పిచ్చి సంబంధం!

రెండేళ్ళ క్రితం పక్క వాటాలో దిగిన చంద్రం అబద్ధం చెప్పలేదు.

పెళ్ళాడతానని అనలేదు. పెళ్ళి వ్యవస్థ గురించి ఎత్తవద్దన్నాడు. శరీరాలు పొందగలిగిన ఓ అద్భుతమయిన ఆనందం వుందన్నాడు. మన చుట్టూ ఓ భావజాలపు వలయముందన్నాడు. కనిపించని ఆత్మ, కనిపించీ కనిపించని హృదయమూ అన్న పేర్లు చెప్పి, ఎదురుగా కనిపించే, కదిలే, కదిలించే, శరీరం వ్యర్థం వ్యర్థమని మనకి నచ్చచెప్పారన్నాడు. లౌకికమయిన ఏర్పాటయిన వివాహాన్ని సెక్సుకు పరిమితం కాదంటూనే సెక్సుకి మించి ఎదగనీయలేదన్నాడు.

చంద్రం అందగాడా! అందమంటే తనకేం తెలుసు! రవ్వంత కనికరపు చూపూ, ఓ మాటా కోసం పరితపించి పోతోంది తను. చంద్రం మాయగాడా? కాదు.

ఆడదాన్ని మోసం చేయడమంత సులువూ, ఆ ప్రాణి ఆత్మవిశ్వాసంతో జీవించేందుకు అవసరమయిన వాతావరణాన్ని సృష్టించడమంత కష్టమూ లేదన్నాడు.

రమణ చంద్రంలోకి నడిచింది. అతని బాహువుల్లోకి మెల్లగా నడిచింది. మగతనం ఉట్టిపడే రొమ్ములోకి నడిచింది. చంద్రం భావాలన్నీ అర్థమయి నడవలేదు. అర్థం చేసుకోవాలన్న ఉద్దేశంతో నడవలేదు. ఆమెకే తెలియని ఆమె ఆకలి నెడుతుంటే.... ఆ మాత్రమయినా చేరువయిన మరో మగప్రాణి లేకపోవడం వల్లనే ఆడా మగా మాట్లాడుకునే మాటలు ఏవయినా అవి చివరకూ చేరేది వివాహంలోకే నన్న నమ్మకంతో నడిచింది.

ఆ రాత్రి లారీని నడిపి సరుకు యజమానికి చేర్చి.... బాధలన్నీ మరిపించే ఆరు డొక్కులూ కొట్టేసి....కొదమ సింగం తూళ్ళుకుంటూ తూలుకుంటూ ఇంటికి చేరింది.

చంద్రం బాహువుల్లో దర్శనమిచ్చింది చెల్లెలు.

ఎండిపోయున్న లోహం ఘండిపోయినట్టూ, గుడిసె మీదున్న వాన ఒక్కమారుగా మొలబంటి లోతు ప్రవాహమయి పోయినట్టు అయింది.

కొదమ సింగానికి అన్ని పట్లూ వదిలేశాయి.

చాలా మంది జ్ఞానులుగా పేరు మోసిన వాళ్ళ అజ్ఞానం వల్ల చాలా చాలా మంది అజ్ఞానులుగా తీసివేయబడే వాళ్ళ సహజ జ్ఞానం భ్రష్టమయి పోయింది. సంఘం సక్రమంగా సాగడం కోసం ఆలోచనాపరులు చేసిన అనేక ఏర్పాట్లవల్ల ఆలోచనా బలహీనుల మానసిక స్థైర్యం సడిలిపోయింది. అందుకే -

కొదమ సింగం కండలు తిరిగిన చేతులు జోడించింది. నా చెల్లెలికి బ్రతుకు యిమ్మని అర్థించింది. బ్రతుకుకు పరిభాష వివాహమేనని విన్నవించింది.

"మీకు అర్థమయీ అవని గౌరవానికి నాకూ అర్థం తెలీదు. నాకు తెలిసిన అర్థమొక్కటే! నా చెల్లెలి నవ్వు! అది వెలుతురా! వెన్నెలా! దీపం వెలుతురా! సూర్యుని వెలుతురా! నాకు తేడా తెలీదు. చంద్రమా! నీవు దీపమయినా సరే! దినకరుడవయినా సరే!" అంది కొదమసింగం కన్నీటితో.

చంద్రం నెమ్మదిగా విశ్వాసంగా మాట్లాడాడు. ఆ మాటలు కొదమ సింగానికే కాదు, కొన్నాళ్ళుగా వాటినే వింటూన్న రమణకీ అర్థం కాలేదు.

అందులో వాళ్ళకి మాటల ఇంద్రజాలం కనిపించినట్టు భావాల నైశిత్యం కనపడడంలేదు. నేర్పుగల ఆటగాడు వాళ్ళ బ్రతుకులని బంతులుగా చేసి నేల మీద పడకుండా చేతిలో నిలపకుండా గాలిలో కదుపుతున్నట్టుగా అనిపిస్తోంది తప్ప...... ఆ మానవుడు తన చుట్టూ వున్న సమాజంలో తన ఉనికిని గమనించి, తన మెదడు ఆ ఉనికిని మించి కదలుతూందంటే ఏదో ఓ మార్పు కోసం పరితపిస్తునట్టు వాళ్ళిద్దరికీ అనిపించడం లేదు.

"శరీరమే నీవు! నీవే శరీరం! ఇంతకు మించి మరేది ఎవరు ముఖ్యం అన్నా, వాళ్ళు తెలిసో, తెలియకో నిన్ను గోతిలోకి తోసేస్తున్నారు. వివాహం పేరుతోగాని, వ్యభిచారం

పేరుతోగాని శరీరాన్ని అమ్ముకోవడమే ఆడదాని దుస్థితి. కొనుక్కోవడమే మగాడి సుస్థితి. కొనుగోలు అమ్మకానికి మూలం. అమ్మకం కొనుగోలుకి మూలం. నువ్వీ వలయాన్ని ఛేదించు. నిన్నీ వలయంలో బందీ చేసుకోకు. అరిస్తే స్వేచ్ఛ రాదు. స్వేచ్ఛను ఎవరూ పళ్ళెంలో పెట్టి ఇవ్వరు. దాన్ని పోరాడి సాధించాలి."

చంద్రం మాటలు కొదమసింగం ముందు కోతి పిల్లల్లా గంతులేస్తున్నాయి. కొదమ సింగానిదొకటే ప్రశ్న -

"నువ్వు నా చెల్లెల్ని ఏం చేస్తావ్?"

"మనిషిని చేస్తాను"

"అంటే?"

"ఆలోచింప జేస్తాను. జీవితానికి అర్థం వెతుక్కునే ఆత్మబలం పొందేటందుకు దోహదం చేస్తాను....."

కదులుతోంది కొదమ సింగం.

"నువ్వు దాన్ని పెళ్ళాడతావా 'లేదా'?"

"ఆడను! నాకు వివాహం మీద విశ్వాసం లేదు!"

"మరేం చేస్తావురా?"

"వెలుగిస్తాను. చదువిస్తాను. చేతికి పలుగిస్తాను. బుద్ధికి పదునిస్తాను. భూమిని పెళ్ళగించి విత్తులు నాటిస్తాను. కొత్త జగతికి కొత్త పంట నిస్తాను" అంటోంది అతని గొంతు.

'అంటే - నా భుజాల మీద దాన్ని కూర్చోబెట్టి, నా ఇంట్లో దాన్ని తినబెట్టి, దానికి కడుపు చేసి, గర్భస్రావం చేసి, నా ఖర్చుతో నీ భావాలకు శవ వస్త్రం కప్పుతావా - ముష్టి వెధవా!' అనలేదు కొదమ సింగం, అనుకుంది. అనడానికి మాటలు లేవు. అందులో కొన్ని నిర్దుష్టమయిన విస్పష్టమయిన కోపం, ప్రేమ వంటి భావాలే వున్నాయి.

కొదమ సింగం గర్జించింది.

"అంటే ఏమిట్రా?"

'ఆవిడను నేనే పోషిస్తాను. తిండీ, బట్టా సమస్తమూ నేనే"- చంద్రం మాటలు పూర్తవలేదు.

చంద్రం పళ్ళు కదిలి పోయాయి. నడుం విరిగి పోయింది. వీపు పగిలి పోయింది.

"నా చెల్లెల్ని ఉంచుకుంటానంటావురా"

అడ్డుపడింది చెల్లెలు. జుత్తు పట్టుకుని నాలుగు పిడిగుద్దులు గుద్దాడు.

"రేపటిలోగా పెళ్ళికి ఒప్పుకుంటావో ఇల్లు ఖాళీ చేస్తావో తేల్చుకో" చంద్రాన్ని మరో రెండు తన్ని రమణను తన వాటా వైపు ఈడ్చుకు పోయాడు.

ఎందుకు చంపలేదు వాడిని? రేపటికి మారతాడని ఆశ....

దబ్బుమన్న చప్పుడుతో ఆలోచనలలో మూసుకున్న కళ్ళు విడ్డాయి. గాభరాగా లేచి నించున్నాడు. బాత్‌రూం తలుపు బార్లా తెరచి వుంది. 'ఏమయావు చెల్లెలా!' అంటున్న అన్న గొంతుకకి అడ్డంగా నిలుచుంది మూడు నిలువుల నూయి.

పైన పడ్తున్న వెన్నెలని తనలోకి రానివ్వడం లేదు ఆ నూయి.

బిగుసుకు పోతున్నాయి కండరాలు.

మూడు నిలువుల లోతున తల ఎన్ని వ్రక్కలయిందో, ఏ కొసనైనా ప్రాణం కదలిక వున్నదేమో తెలీని చెల్లెలి శరీరపు ఆనవాళ్ళ కోసం నిప్పు కత్తుల్లా ఉరుకుతున్నాయి చూపులు. మూలుగు కోసం వెర్రిగా వెదుకుతున్నాయి చెవులు.

నిశ్శబ్దం. వెన్నెలతో జత కలిసిన నిశ్శబ్దం.

భయాలు విడిపోయాయి. బంధాలు విడిపోయాయి.

ఆశయాలు ఎగిరి పోయాయి. ఆలోచనలు ఎగిరి పోయాయి.

సంకెళ్ళు తెగిన కొదమ సింగం దృఢ నిశ్చయంతో చంద్రం గది తలుపులను బాదింది. తలుపు తెరిచిన ఆ ప్రాణిని ఒక్క ఊపున భుజాన వేసుకుని నడిచింది.

"మనిషిని చేస్తావో.... పెళ్ళి చేసుకుంటావో.... వెళ్ళి చెయ్యరా!"

భయానకమయిన ఆర్తనాదాన్ని తనలోకంటా లాక్కుంది ఆ మూడు నిలువుల నూయి.

ఆ కేక.....ఆగిపోయింది. నిశ్శబ్దం!

వెన్నెల నిండిన ఆ రాత్రి - రెండు శరీరాల కదలికను హరించింది. మరో శరీరం కదలికను చట్టబద్ధంగా హరించే ప్రయత్నాన్ని మొదలించింది.

ఎన్నెన్నో రాత్రులను వెన్నెలతో నింపి, ఎన్నెన్నో యుగాల నుంచి ఎన్నెన్నో కథలను చూస్తున్న చంద్రుడికి ఓ ప్రశ్న మిగిలి పోయింది.

భూమ్మీద అన్ని ప్రాణులలాగే మానవ ప్రాణులకూ పుట్టుకా, చావూ వున్నాయి. అయితే మానవులకు భావాలున్నాయి. భావాల కోసం అర్ధాంతరపు చావులున్నాయి. అయినా-

మానవులకు భావాలు పుడుతూనే వున్నాయి. అవి ఆచరణలుగా మారడానికి ప్రయత్నిస్తూనే వున్నాయి. బలపడుతూనే వున్నాయి. తోటి మానవుల జీవితాలను కదిలించుతూనే వున్నాయి. బలహీన పడుతున్నాయి. గిడుతూనూ వున్నాయి. మానవుడు అడుగులు వేస్తూనే వున్నాడు.

ఇంతకీ వీళ్ళ నడకకి దిశ ఏమిటి? వీళ్ళ బాట సరళ రేఖా? వృత్తమా? ●

★ *(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక : 3 - 11 -1989)* ★